క్లుప్తంగా

పల్లకీలో విహరించిన మహానందీశ్వర దంపతులు



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారికి శ్రావణమాసం, శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు స్వామి,అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో శాస్త్రోక్త పూజల అనంతరం పల్లకీసేవ కనులపండువగా జరిగింది. వివిధ ప్రాంతాల భక్తులు పల్లకిసేవలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

టీకాతోనే వ్యాధుల నివారణ

నందికొట్కూరు రూరల్: రైతులు తమ పశువులకు సకాలంలో టీకాలను వేయించడం ద్వారా పశువ్యాధులను నివారించవచ్చని బిజినవేముల సర్పంచ్ రవి యాదవ్ అన్నారు. శుక్రవారం గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఆవులకు ముద్ద చర్మవ్యాధి నివారణ టీకాలు వేయించారు. అనంతరం రైతులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొణిదేల పశువైద్యుడు నవీన్ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న ఎలక్ట్రికల్ కార్మికులు

నందికొట్కూరు రూరల్: ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎలక్ట్రికల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు రోషన్‌బాషా కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద డీటీ కిషోర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రోషన్‌బాషా మాట్లాడుతూ ప్రతి మండలంలో ఎలక్ట్రికల్ కార్మికుల కోసం సర్వీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం సబ్సిడీని అందజేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ మండల సెక్రటరీ జాకీర్‌బాషా, నాయకులు సోపిసా, శంకరయ్య, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత

నందికొట్కూరు: అనారోగ్యంతో మృతిచెందిన మారుతీనగర్ చెన్నయ్య కుటుంబ సభ్యులకు తక్షణ ప్రభుత్వ తక్షణ సాయంగా రూ.10 వేల నగదును శుక్రవారం 12వ వార్డు కౌన్సిలరు లాలుప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ బీమా పేద కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, బాషా, చరణ్‌తేజ పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



పత్తి పంటపై అవగాహన కల్పిస్తున్న ఏరువాక కేంద్రం సైంటిస్ట్ డాక్టర్ రామకృష్ణారావు

మిడుతూరు: సస్యరక్షణలో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కర్నూలు జిల్లా ఏరువాక కేంద్రం సైంటిస్టు డాక్టర్ రామకృష్ణారావు అన్నారు. మిడుతూరు, పీరుసాహెబ్ పేట, కడుమూరు గ్రామ పరిధిలోని సాగు చేసిన నిమ్మసాగు, పత్తి పైర్లను సందర్శించారు. పత్తి పైరులో రసం పీల్చే పురుగులు (పచ్చదోమ, తామర పురుగులు), మెగీ్నషియం ధాతులోపాలను గుర్తించారు. గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఎకరాకు 20 చొప్పున పెట్టుకోవాలని రైతులకు ఆయన సూచించారు. నిమ్మసాగు, పత్తిపంటలో తెగుళ్లు, నివారకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ అశోక్, రైతులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



ప్రహరీ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ఏఈ మనోధర్

జూపాడుబంగ్లా: ఆసుపత్రి భవన నిర్మాణ పనులను రోడ్లు, భవనాల శాఖ ఏఈ మనోధర్ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనివార్యకారణాల వల్ల నిర్మాణం ఆలస్యమైందన్నారు. ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఈనెలాఖరులోగా పనులు పూర్తవుతాయని, వచ్చే నెలలో ఆసుపత్రి నూతన భవనం ప్రారంభిస్తామని తెలిపారు.

పైర్లకు ప్రాణం

దాదాపు పదిహేను రోజులుగా వాన దేవుడు ముఖం చాటేశాడు. భూమిలో వేసిన విత్తనం మొలకెత్తి కాస్త పెరుగుతున్న వేళ గొంతులో తడి ఆరిపోయినట్లయింది. ఆకాశం వైపు ఎదగాల్సిన పైర్లు వాడుబట్టి తలలు నేలవైపు వాల్చుతున్న వేళ.. ప్రభుత్వం ఊపిరి పోసింది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సమన్వయంతో కేసీ కాల్వకు నీటిని విడుదల చేయించడంతో అన్నదాతల ఆశలు రేకెత్తాయి. రెండు రోజులుగా పిల్ల కాల్వల ద్వారా నీళ్లు పారించుకుంటూ అన్నదాత తమ పైర్లకు ప్రాణం పోస్తున్నారు.



నీరుకట్టడంతో కళకళలాడుతున్న మొక్కజొన్న

- కేసీ కాల్వకు నీటి విడుదలతో రైతన్నల హర్షం
- పైర్లకు ప్రాణం పోసే పనిలో అన్నదాతలు నిమగ్నం
- వాడుపట్టిన పైర్లకు జీవం



కేసీ కాల్వకు నీళ్లు వదలటంతో పంటకాల్వల్లో ప్రవహిస్తున్న సాగునీరు



మొక్కజొన్న పైరుకు నీరు కడుతున్న రైతు

జూపాడుబంగ్లా: కర్నూలు–కడప కాల్వకు సాగునీరు విడుదల చేయటంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌కు కేసీ కాల్వ ఆయకట్టు కింద మొక్కజొన్న, పత్తి, సోయాబీన్, మినుము, కంది, వరి పంటలు సాగుచేశారు. పక్షం రోజుల నుంచి వర్షం కురవకపోవటంతో పైర్లు వాడుముఖం పట్టాయి. వాటిని ఎలా కాపాడుకోవా లో అర్థం కాక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో కేసీ కాల్వకు సాగునీరు విడుదల చేయటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. కేసీ కాల్వ వెంట ఉన్న ప్రాతకోట, భాస్కరాపురం, తాటిపాడు, జూపాడుబంగ్లా, 80 బన్నూరు, పోతులపాడు, తరి గోపుల, తూడిచెర్ల, కనకయ్యకొట్టాల గ్రామాల్లోని రైతులు లష్కర్ల సహకారంతో కేసీ కాల్వ తూములను ఎత్తుకొని పంటపొలాలకు సాగునీరు కట్టుకుంటున్నారు. దీంతో ప్రాణం పోతున్న పంటలకు ఊపిరి పోసినట్లయిందని రైతులు పేర్కొంటున్నారు. రేయింబవళ్లు సాగునీటిని పారించుకోవటంలో నిమగ్నమయ్యారు. వారం క్రితమే సాగునీటిని విడుదల చేసినట్లయితే పంటల దిగుబడి మరింత మెరుగ్గా ఉండేదని, ప్రస్తుతం కొంత మేర తగ్గే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. కాగా ఖరీఫ్ సీజన్‌లో మండలం వ్యాప్తంగా 2,821 హెక్టార్లలో మొక్కజొన్న, 18 హెక్టార్లలో మినుము, 632 హెక్టార్లలో కంది పంట సాగైనట్లు వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు.

పైరు ఎండిపోతుంటే కళ్లలో నీళ్లొచ్చాయి



ఎకరాకు రూ.20 వేల చొప్పున ముందస్తు కౌలు చెల్లించి 4.75 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశాను. కౌలు మొత్తం కాక ఇప్పటిదాకా ఎకరాకు రూ.20 వేల పెట్టుబడి పెట్టాను. బాగున్న పొలం సాగునీరు లేక కళ్లెదుటే ఎండిపోతుంటే కళ్లల్లో నీళ్లొచ్చాయి. ఈక్రమంలో అధికారులు కాల్వకు నీళ్లు వదలడంతో పైర్లకు ఊపిరిపోసినట్లయింది.

– ఎల్లగౌడు, రైతు

గొంతులో నీళ్లు పోసినట్లయింది



2.50 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశాను. మొలక బాగా వచ్చి పైరు ఎదుగుతున్న దశలో వాన దేవుడు ముఖం చాటేశాడు. పైర్లు వాడిపోతుంటే బాధేసింది. వారం క్రితమే కాల్వకు సాగునీరిచ్చింటే ఇంకా బాగుండేది. ఇప్పటికైనా సాగు నీరు విడుదల చేశారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు.

– బికుసాహెబ్, రైతు

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వెంకటాపురం గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. నాలుగేళ్లలో పొందిన లబ్ధిని వివరించి, సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు కుందూరు నాగేశ్వరరెడ్డి, లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, ఇందిరేశ్వరం సర్పంచ్ నారాయణ రెడ్డి, ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ ఉమాదేవి, ఏఓలు విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్‌బాబు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శిల్పాకు గజమాలతో స్వాగతం పలుకుతున్న కుందూరు నాగేశ్వరరెడ్డి, లక్ష్మీరెడ్డి

సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా

నందికొట్కూరు రూరల్: సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని బ్రాహ్మణకొట్కూరు అగ్రికల్చర్ సొసైటీ చైర్మన్ మద్దూరు సతీష్ కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు అందుబాటులో ఉంటూ సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. అనంతరం సొసైటీ సభ్యులుగా గంగాధరప్ప, వెంకటనారాయణ సంతకాలు చేశారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బైరెడ్డి మల్లికార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, నాయకులు చంద్రమౌళీ, గ్రామ సర్పంచ్ మరియమ్మ, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ మంజుల, జెడ్పీటీసీ సభ్యులు కరిమున్నిసా, మున్సిపల్ చైర్మన్ సుధాకరరెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఓంకార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రాహ్మణకొట్కూరు సొసైటీ చైర్మన్ సతీష్‌కుమార్‌రెడ్డి

ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవర్చుకోవాలి



ఎంపీడీఓ కార్యాలయం ముందు నా మట్టీ -నాదేశం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



మట్టి కలశాలు ప్రదర్శిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ దేశభక్తిని అలవర్చుకోవాలని ఎంపీడీఓ మేరి సూచించారు. శుక్రవారం ఎన్ఆర్ఈజీఎస్, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద ఏపీఓ రేష్మ ఆధ్వర్యంలో నా మట్టీ–నాదేశం కార్యక్రమం నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా సేకరించిన మట్టి, కలశాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ దేశం పట్ల భక్తి, ప్రేమ కలిగి ఉండాలన్నారు.

అమరవీరుల త్యాగాలు స్మరించుకుందాం

మిడుతూరు: అమరవీరుల త్యాగాలు, స్వాతంత్ర్య సమరయోధులనుస్మరించుకోవాలని ఏపీఓ జయంతి అన్నారు. శుక్రవారం ఆజాదీ కా అమృత్ సరోవర్‌లో భాగంగా నా దేశం- నామట్టి కార్యక్రమం నిర్వహించారు. అన్ని గ్రామాల నుంచి సేకరించిన మట్టితో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ ఫకృద్దీన్, ఏఓ సురేష్ కుమార్ పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న పోలింగ్ సిబ్బంది, ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ, ఎస్ఐ వెంకటసుబ్బయ్య

నేడే ఉప ఎన్నిక

- పోలింగ్ సామాగ్రితో పోలింగ్ కేంద్రానికి చేరుకొన్న సిబ్బంది
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టబందోబస్తు

జూపాడబంగ్లా: తర్తూరు–2వ వార్డు ఉప ఎన్నిక పోలింగ్ గ్రామంలోని సచివాలయంలో శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన బ్యాలెట్‌పత్రాలు, బ్యాలెట్‌బాక్సు, పోలింగ్ సామగ్రితో సిబ్బంది తర్తూరులోని పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు.

ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 1గంట వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం ఓట్లలెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఎవ్వరికి ఓట్లు అధికంగా వస్తే వారిని 2వార్డు మెంబరుగా ప్రకటిస్తూ డిక్లరేషన్ ఫారాన్ని పోలింగ్ అధికారి అందజేస్తారని తెలిపారు. 2వార్డు మెంబరు ఉప ఎన్నికలో 168మంది ఓటర్లు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోనున్నట్లు తెలిపారు. వారిలో 86మంది పురుషులు, 82మంది స్త్రీలు ఉన్నట్లుతెలిపారు.

మిడుతూరు: మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పైపాలెం 5వ, అలగనూరు 10వ వార్డులకు శనివారం ఉప ఎన్నిక జరగనుందన్నారు. అందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు.

కొత్తపల్లి: మండల కేంద్రంలోని 10వ వార్డు ఉప ఎన్నిక శనివారం జరగనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ స్టేజ్–2 అధికారి పెద్దన్న శుక్రవారం తెలిపారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 7 నుంచి పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 1 గంటకు ముగుస్తుందన్నారు.

పగిడ్యాల: స్థానిక దేవనగర్ కాలనీలోని 9వ వార్డుకు శనివారం జరగనున్న పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు నందికొట్కూరు అర్బన్ సీఐ విజయభాస్కర్, ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జునలు తెలిపారు. శుక్రవారం వారు పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్ల కోసం బారీగేడ్లు ఏర్పాటు చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుభాన్, ఎంపీడీఓ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, జావేద్, వీరన్నయాదవ్ పోలింగ్‌ను సందర్శించారు.

మహానందిలో వైభవంగా లక్ష్మీహోమం



అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న ఈఓ, పండితులు

మహానంది: శ్రావణమాసం, తొలి శుక్రవారం పురస్కరించుకుని మహానంది ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో అర్చకులు, పండితులు కామేశ్వరీదేవికి ప్రాతఃకాలంలోనే ప్రత్యేక అభిషేకం, పూలంగిసేవ, లక్ష్మీహోమం, శ్రీ చక్రపూజలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన వారణాసి రామమోహన్‌రావు, విజయలక్ష్మి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. భక్తులకు ఈఓ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఈ-క్రాప్ నమోదు పరిశీలన



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

వెలుగోడు: మండల పరిధిలో మోతుకూరు పరిధిలో కొనసాగుతున్న ఈక్రాప్ నమోదును ఆత్మకూరు ఏడీ ఆంజనేయ, వెలుగోడు మండల వ్యవసాయ అధికారి పవన్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది రామలక్ష్మమ్మ, నాగలింగం పాల్గొన్నారు.

మహానంది: సాగు చేసే పంటల వివరాలు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి రైతులకు సూచించారు. అబ్బీపురం పరిధిలో కొనసాగుతున్న పంటనమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు.

యువకుడి దుర్మరణం

– మరొకరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన రాజా

పెద్దదోర్నాల: నంద్యాల జిల్లా పరిధిలోని చెంచుకుంట వద్ద శుక్రవారం ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు.ఎస్ఐ అంకమరావు కథనం మేరకు.. శ్రీశైలం ప్రాజెక్టు చెందిన రాజా, నరసింహులు ఆత్మకూరులో వ్యక్తి గత పనులు ముగించుకుని తిరిగి శ్రీశైలం వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో రాజా మృతి చెందగా నరసింహులు తీవ్రంగా గాయపడ్డాడు. 108 సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రుడిని పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాసవీ కన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు


నందికొట్కూరు: శ్రావణ మాస మొదటి శుక్రవారం పురస్కరించుకుని శ్రీశ్రీ చక్ర సహిత వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయములో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుబేరలక్ష్మి పూజ, యంత్రముతో విశేషపూజా కార్యక్రమాలను ఆర్యవైశ్య వాసవీ మహిళా మండలి అధ్యక్షురాలు ఈపూరు నాగకుమారి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు ధనుంజయ స్వామి పర్యవేక్షణలో నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి మహిళలు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



అమ్మవారు ప్రత్యేక పూజాల్లో పాల్గొన్న మహిళలు

కొనసాగుతున్న నీటి విడుదల

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదల కొనసాగుతున్నట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం డ్యాంలో సాయంత్రం 6 గంటల సమయంలో 860.40 అడుగుల నీటి మట్టం ఉండగా పోతిరెడ్డిపాడు వద్ద 859.40 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు తెలిపారు. పోతిరెడ్డిపాడు ఐదు గేట్ల ద్వారా నిన్నటి వరకు 11వేల క్యూసెక్కుల నీటిప్రవాహం కొనసాగుతుండగా ప్రస్తుతం వెయ్యి క్యూసెక్కులు తగ్గి 10 వేల క్యూసెక్కుల నీరు ఎస్సార్‌ఎమ్సీ కాల్వలోకి చేరుతుందని పేర్కొన్నారు. ఈ నీటిని బానకచర్ల నీటినియంత్రణ వ్యవస్థ నుంచి తెలుగుగంగ కాల్వకు 5,000 క్యూసెక్కులు, ఎస్సార్బీసీ(జీఎన్ఎస్ఎస్) కాల్వకు 4,000, కేసీ ఎస్కేప్ కాల్వకు 1,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర తెలిపారు. ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయంలోకి నీటి ప్రవాహం నిలిచిపోవటం, అదే క్రమంలో డ్యామ్ నుంచి నీటి విడుదల కొనసాగుతుంతో డ్యాంలో నీటిమట్టం తగ్గుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితులు ఇలాగే ఉంటే మరో పక్షం రోజుల్లో పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటిప్రవాహం నిలిచిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి కొనసాగుతున్న నీటి ప్రవాహం

పెయ్యదూడల ఉత్పత్తికి లింగనిర్ధారిత వీర్యం

- ఏపీఎల్‌డీఏ సీఈఓ డాక్టర్ శ్రీనివాసులు

మహానంది: పెయ్యదూడల ఉత్పత్తికి రైతుల పాడిపశువులకు సబ్సిడీతో లింగనిర్ధారిత వీర్యం అందిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డాక్టర్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. మహానందీశ్వరుడి దర్శనార్థం శుక్రవారం ఆయన మహానందికి వచ్చారు. స్వామి, అమ్మవారి దర్శనం అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పెంచుకునే పశువుల్లో సాధారణంగా యాభై శాతం మగ, యాభైశాతం పెయ్యదూడలు జన్మిస్తుంటాయన్నారు. రైతులకు లాభాలు చేకూరాలన్న ఉద్దేశంతో ఏపీఎల్‌డీఓ ఆధ్వర్యంలో వంద శాతం పెయ్యదూడలు జన్మించేలా వీర్యం అందిస్తున్నట్లు చెప్పారు. రెండు డోసుల ఖరీదు రూ.1,350 కాగా రైతులకు తొంభై శాతం సబ్సిడీతో కేవలం రూ.500 మాత్రమే చెల్లిస్తే చాలన్నారు. రెండు డోసుల అనంతరం ఫలితం రాకపోతే డబ్బు తిరిగి ఇస్తామన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 40 వేల డోసులు చేశామని, పదివేల వరకు పశువులు గర్భం దాల్చగా సత్ఫలితాలు ఇచ్చాయన్నారు. గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ప్రజాప్రతినిధులు, రైతులు వినియోగించుకోవాలని కోరారు. ముర్రాజాతితో పాటు సంకర జాతి ఆవులకు అందిస్తామన్నారు. పశువైద్యాధికారి కరుణాకర్ పాల్గొన్నారు.



గోశాల అర్చకుడితో మాట్లాడుతున్న సీఈఓ డాక్టర్ శ్రీనివాసులు

ఉన్నతాధికారులకు మహానందీశ్వరుడి ప్రసాదాలు



జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డికి మెమెంటో అందిస్తున్న చైర్మన్, ఈఓ, పండితులు



ఎస్పీని సన్మానిస్తున్న ఈఓ, చైర్మన్‌లు

మహానంది: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా తాటిమాకుల రాహుల్ కుమార్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిలు శుక్రవారం నంద్యాలకు వెళ్లి కలిశారు. ఆయనకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జేసీగా రాహుల్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఇండియన్ పోలీస్ మెడల్ అవార్డు అందుకున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డిని కలిసి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు చేశారు.

వేతనాలు చెల్లించాలి

కొత్తపల్లి: స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, స్వచ్ఛ భారత్ గ్రామీణ పారిశుధ్య కార్మికుల యూనియన్ నాయకులు మల్లేష్, హనుమంతు మాండ్ చేశారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలు గడవడం కష్టంగా ఉందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు వేతనాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ గ్రామీణ పారిశుధ్య కార్మికులు స్వాములు, వెంకటేశ్వర్లు, రాజారావు, జయన్న తదితరులు పాల్గొన్నారు.